
సాక్షి
గుంటూరు
గురువారం । 7 । మార్చి । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 515.00 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్. కరికల వలవన్ దంపతులు బుధవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను దర్శించుకున్నారు.

యార్డుకు 1,44,511 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,44,511 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,38,827 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

న్యూస్‌రీల్

ఉద్యోగినులకు ఆటల పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జెడ్పీ, ఇంజినీరింగ్ కార్యాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగినులకు జెడ్పీ ప్రాంగణంలోని మైదానంలో ఆటల పోటీలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ సమాజంలో పురుషులతో పోటీ పడి మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. నిరంతరం వృత్తి జీవితంలో బిజీగా ఉంటున్న ఉద్యోగినుల్లో ఉత్సాహం నింపేందుకు పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బత్తుల అనురాధ, కాకుమాను జెడ్పీటీసీ గుల్జార్ బేగం, ఉద్యోగినులు పాల్గొన్నారు.

మిర్చి యార్డుకు మూడు రోజులు సెలవులు

కొరిటెపాడు(గుంటూరు) శివరాత్రి పండుగ సందర్భంగా గుంటూరు మార్కెట్ యార్డుకు వరుసగా మూడు రోజుల పాటు సెలవులు వచ్చాయి. శుక్రవారం శివరాత్రి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. అంతేకాకుండా శని, ఆదివారాలు సాధారణ సెలవులు కలుపుకొని మొత్తం మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించడం జరిగిందని మార్కెటింగ్ శాఖ రీజనల్ జాయింట్ సెక్రటరీ, యార్డు ఇన్‌చార్జి సెక్రటరీ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. యార్డులో 11వ తేదీ నుంచి యథావిధిగా క్రయ, విక్రయాలు కొనసాగుతాయని వెల్లడించారు. సెలవు రోజుల్లో రైతులు మిర్చి బస్తాలను యార్డుకు తీసుకు రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

బాజీబాబా ఆదాయం రూ.13.28 లక్షలు



పెదకాకాని: బాజీబాబా దర్గాలో హుండీ కానుకల ద్వారా వచ్చే ఆదాయం గణనీయంగా పెరిగిందని వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్, దర్గా ఈఓ షేక్ ముక్తార్‌బాషా అన్నారు. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారుల ఆదేశాల మేరకు బుధవారం హుండీ తెరిచి కానుకలు లెక్కించారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు సూపరింటెండెంట్ షేక్ హైదర్ బాషా పర్యవేక్షణలో వీడియో నిఘా, పోలీసు బందోబస్తుతో కానుకల లెక్కింపు చేపట్టారు. దర్గాలోని మొత్తం 6 హుండీలు ద్వారా బాజీబాబా వారికి రూ.13,28,050 ఆదాయం లభించింది. గడిచిన ఐదు నెలల కాలానికి ఈ ఆదాయం లభించిందని ఈఓ షేక్ ముక్తార్‌బాషా తెలిపారు. వక్ఫ్ బోర్డు అసిస్టెంట్ సెక్రటరీ షేక్ ఆదం షఫీ, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభానీ, రెవెన్యూ, పోలీసు, దర్గా సిబ్బంది, కెనరాబ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్ల అడిషనల్ ఎస్పీ బదిలీ

అడిషనల్ ఎస్పీగా విఠలేశ్వర్ నియామకం

బాపట్లటౌన్: బాపట్ల జిల్లాలో అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న పి.మహేష్‌ను విశాఖపట్నం జిల్లా, క్రైం విభాగం అడిషనల్ డీసీపీగా బదిలీ చేశారు. బాపట్ల జిల్లాకు ఏసీబీ విభాగంలో అడిషనల్ ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న టి.పి.విఠలేశ్వర్‌ను నియమిస్తూ రాష్ట్ర డీజీపీ కార్యాలయం బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేసింది.

ఎక్సైజ్ శాఖ డీసీగా బాబ్జీరావు



నెహ్రూనగర్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గుంటూరు జోన్ డెప్యూటీ కమిషనర్‌గా ఎస్‌వీవీఎన్ బాబ్జీరావు బుధవారం గుంటూరులోని ఎక్సైజ్ డీసీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం జోన్ డీసీగా పనిచేస్తున్న బాబ్జీరావు గుంటూరు జోన్ డీసీగా బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ డీసీగా పనిచేసిన టి.శ్రీనివాసరావు ఏపీఎస్‌బీసీఎల్ డీజీఎంగా బదిలీపై హెడ్ క్వార్టర్స్‌కు వెళ్లారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.6000, గరిష్ఠ ధర రూ.7700, మోడల్ ధర రూ.6800 వరకు పలికింది.

విద్యా కాంతులు మెరవాలంటీరో

అక్షరాలే హరివిల్లులై విరిసినట్టు.. విద్యాకాంతులు ఉషస్సులై ఉదయించినట్టు.. ప్రతిభా సుమాలు సువర్ణమాలై గ్రామ సిగన అలంకరించినట్టు.. ఆ గ్రామస్తుల మదిలో తళుక్కున మెరిసిన ఆలోచన నవ కిరణాలై బడి ముంగిళ్లలో తళుకులీనినట్టు.. వెనిగండ్ల గ్రామం నవోదయానికి ఆహ్వానం పలికింది. అద్భుతాల ఆవిష్కరణకు బాటలు వేసింది. అక్షరాస్యత పెంచాలని తలంచిన గ్రామస్తులు, పేరెంట్స్ కమిటీ కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్ఫూర్తితో మహత్తర యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలో ప్రతి 50 ఇళ్లకు ఓ వలంటీర్‌ను నియమించినట్టే శ్రీవేమన జెడ్పీ హైస్కూల్లో వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. మూడు నెలల కిందట అంకురమైన ఈ ప్రక్రియ దిగ్విజయంగా అమలవుతూ సత్ఫలితాలనిస్తోంది.

వెనిగండ్ల గ్రామ సిగన సువర్ణాక్షరం

- విద్యార్థుల భవితను తీర్చిదిద్దే వినూత్న ఆలోచన
- శ్రీవేమన జెడ్పీ హైస్కూల్లో వలంటీర్ వ్యవస్థ
- ప్రత్యేక తరగతుల నిర్వహణకు 13 మంది నియామకం
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ముందుకు
- చిన్నగా మొదలై విజయవంతంగా అమలు
- పేరెంట్స్ కమిటీ, గ్రామస్తుల సమష్టి కృషి ఫలితమే

గుంటూరు ఎడ్యుకేషన్: పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలోని శ్రీవేమన జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు సుమారు వెయ్యి మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడికి గ్రామంతోపాటు సమీప గ్రామాలైన అగతవరప్పాడు, పెదకాకాని నుంచి విద్యార్థులు వస్తుంటారు. వీరిలో పేదవర్గాల వారే ఎక్కువ. ఎక్కువ మంది వ్యవసాయ కూలీల పిల్లలే. వీరికి ఇళ్ల వద్ద చదువుకునే పరిస్థితులు ఉండవు. మార్గదర్శనం చేసేవారూ ఉండరు. దీనివల్ల విద్యా ప్రమాణాలు సన్నగిల్లే అవకాశం ఉందనే ఉద్దేశంతో వెనిగండ్ల గ్రామపెద్దలు, పేరెంట్స్ కమిటీ సభ్యులు విద్యావలంటీర్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విషయమై తల్లిదండ్రులతో పలుమార్లు చర్చించి వారి అంగీకారం తీసుకున్నారు. గ్రామంలోనే ఉన్నత విద్యార్హత (బీఏ, బీకాం, బీఎస్సీ, బీటెక్ అర్హతలు కలిగినవారితో పాటు బీఏ బీఈడీ, ఎమ్మెస్సీ ఫిజిక్స్, ఎమ్మెస్సీ బీఈడీ, ఎంఏ హిందీ పండిట్, ఎమ్మెస్సీ బీఈడీ, ఎంఏ ఎంఫిల్)ఉన్న 13 మంది యువతీయువకులను నియమించారు. వీరు పాఠశాలలో 6,7,8,9 తరగతుల విద్యార్థులకు ఉదయం



శ్రద్ధగా ఆలకిస్తున్న విద్యార్థులు (ఇన్‌సెట్‌లో) పాఠశాలలో ఐఎఫ్‌పీ విధానంలో బోధన

సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులతో హోం వర్క్ పూర్తి చేయించడంతోపాటు ఆ రోజు చెప్పిన పాఠ్యాంశాలను మరోసారి చదివించి, వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి 5.30 వరకు తరగతులు సాగుతున్నాయి.

గతంలోనూ ప్రత్యేక తరగతులు

ఈ పాఠశాలలో గతంలో 1986 నుంచి 2013 వరకు ఏడు, పది తరగతుల విద్యార్థులకు ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించేవారు. దాదాపు పదేళ్ల నుంచి ప్రత్యేక తరగతుల నిర్వహణ లేదు. పరీక్షల సమయంలో కేవలం పదో తరగతి విద్యార్థులకు మాత్రమే ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మిగిలిన తరగతుల పిల్లలు ఇళ్లకు వెళ్లాక టీవీలకు అతుక్కుపోవడం, ఫోన్‌లకు అలవాటు పడడం తోపాటు తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడంతో చదువులో వెనుకబడ్డారు. ఈ విషయాన్ని గుర్తించిన గ్రామస్తులు మళ్లీ ప్రత్యేక తరగతుల నిర్వహణకు శ్రీకారం చుట్టారు.

2018 నుంచి పదవ తరగతి ఫలితాలు ఇలా..

సంవత్సరం	ఫలితాల శాతం
2018-19	97
2019-20	100
2020-21	100
2021-22	78
2022-23	79

జిల్లా స్థాయిలో గుర్తింపు

శ్రీవేమన జెడ్పీ హైస్కూల్‌కు జిల్లాస్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంది. వెనిగండ్లలో పుట్టి, పెరిగి ఇదే పాఠశాలలో టెన్త్ పూర్తి చేసుకుని వెళ్లిన ఎంతో మంది పూర్వ విద్యార్థులు దేశవిదేశాల్లో ఉన్నత రంగాల్లో రాణిస్తున్నారు. ఏటా పదో తరగతి పరీక్షల్లో ఈ పాఠశాల విద్యార్థులు సత్తాచాటుతున్నారు. టాప్-5లో స్థానం సంపాదిస్తున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక రెండేళ్లపాటు వరుసగా నూరుశాతం ఫలితాలు సాధించింది. ఈ పాఠశాల అప్‌గ్రేడ్ కావడంతో ఇక్కడ రెండేళ్ల క్రితం ఇంటర్మీడియెట్ కూడా ప్రారంభమైంది. ప్రస్తుతం 63 మంది ఇంటర్ చదువుతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని ఆకాంక్ష

మనబడి నాడు-నేడు మొదటి దశలో రూ.65 లక్షలతో పాఠశాలను ఆధునికీకరించిన ప్రభుత్వం, సకల వసతులను కల్పించింది. ప్రస్తుతం రెండో దశలో రూ.30 లక్షల నిధులతో మూడు అదనపు తరగతి గదుల నిర్మాణం జరుగుతోంది. ప్రతి తరగతి గదిలో ఐఎఫ్ ప్యానెళ్లను ఏర్పాటు చేశారు. 8, 9 తరగతుల విద్యార్థులకు ప్రత్యేకంగా ట్యాబ్‌లు అందాయి. ఆధునిక తరగతి గదులతోపాటు సువిశాల ప్రాంగణం పచ్చదనంతో ఆకట్టుకుంటుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో చేపట్టిన ఈ వలంటీర్ల వ్యవస్థను ప్రతి పాఠశాలలో అమలు చేస్తే బాగుంటుందనే ఆకాంక్ష గ్రామస్తుల నుంచి వ్యక్తమవుతోంది.

సమష్టి కృషితో విద్యా వలంటీర్ వ్యవస్థకు నాంది



మా పాఠశాలలో గతంలో 28 ఏళ్లపాటు ప్రత్యేక తరగతులు కొనసాగాయి. ప్రస్తుతం విద్యార్థులు ఇళ్లకు వెళ్లాక టీవీలు, ఫోన్లకు అలవాటు పడుతున్నారు. చదువుపై శ్రద్ధ పెట్టడం లేదు. దీంతో విద్యాప్రమాణాలు సన్నగిల్లడాన్ని గమనించాం. అందుకే పేరెంట్స్ కమిటీతో చర్చించి, తల్లిదండ్రులను ఒప్పించి విద్యా వలంటీర్ విధానాన్ని తెచ్చాం. ఎంతో మంది విద్యావేత్తలు, నిపుణులు మేం చేసిన ప్రయోగాన్ని ప్రశంసిస్తున్నారు. ప్రభుత్వం విద్యావ్యవస్థ అభివృద్ధికి చేస్తున్న కృషి భేష్. నాడు-నేడుతో పాఠశాలలో ఎన్నో వసతులు సమకూరాయి. ఇక్కడ అమలవుతున్న వలంటీర్ వ్యవస్థను అన్ని పాఠశాలల్లో అమలు చేస్తే బాగుంటుంది. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– ఏ.ధర్మారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్

తల్లిదండ్రుల సహకారంతో..



పాఠశాలలో అందిస్తున్న విద్య బాగుంది. అయితే ఇళ్లకు వెళ్లిన విద్యార్థులను ఇంటి దగ్గర చదివించే పరిస్థితులు లేకపోవడంతో తల్లిదండ్రులను ఒప్పించి, ఈ విధానాన్ని ప్రవేశపెట్టాం. 6,7,8,9 తరగతుల వారీగా తల్లిదండ్రుల సహకారంతో నిర్విరామంగా దీనిని ముందుకు తీసుకెళుతున్నాం. విద్యార్థులకు కూడా ఇది మంచి అవకాశం. మంచి ఉత్తీర్ణతకు వెసులుబాటుగా ఉంటుంది.

– కొండమడుగుల నాగజ్యోతి, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్

రోజూ రెండున్నర గంటలు అదనంగా..



పాఠశాలలో రోజూ రెండున్నర గంటలు అదనంగా ఉంటున్నాం. ప్రత్యేక తరగతుల ద్వారా కొత్తగా వచ్చిన వలంటీర్లు చక్కగా బోధిస్తూ, సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

ఎస్.శృతి జెస్సీ, 8వ తరగతి విద్యార్థిని

సబ్జెక్టుల వారీగా తర్ఫీదు



స్కూల్ వదిలి ఇంటికి వెళ్లిన తరువాత హోం వర్క్ చేసుకునే సమయంలో ఏదైనా డౌట్ అడిగితే చెప్పే అవకాశం లేదు. స్కూల్లోనే కొత్తగా వచ్చిన వలంటీర్లు హోం వర్క్ చేసే సమయంలో డౌట్లు క్లియర్ చేస్తున్నారు. సబ్జెక్టుల వారీగా చదివిస్తున్నారు.

– పఠాన్ అబూబకర్ సిద్దిక్ ఖాన్, 9వ తరగతి విద్యార్థి

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ



9వ తరగతి విద్యార్థులకు గణితశాస్త్రంలో సందేహాలను నివృత్తి చేస్తున్నాను. వచ్చే ఏడాది టెన్త్‌కు వెళ్లే విద్యార్థులు కావడంతో శ్రద్ధ చూపించి, చదివిస్తున్నాను. టీచర్ ఇచ్చిన వర్క్ ఇక్కడే పూర్తి చేయిస్తున్నాం.

–దుర్గం సాయిహర్ష, ఎమ్మెస్సీ ఫిజిక్స్, విద్యా వలంటీర్

టెట్, డీఎస్సీకి సిద్ధమవుతున్నా



మా స్వగ్రామం ఇదే. ఎమ్మెస్సీ, బీఈడీ పూర్తి చేసి ప్రస్తుతం టెట్ రాస్తూనే డీఎస్సీకి సిద్ధమవుతున్నా. గత రెండు నెలలుగా పాఠశాలలో 7వ తరగతి విద్యార్థులకు బోధిస్తున్నాను. విద్యా వలంటీర్ విధానం ఎంతో బాగుంది.

– సీహెచ్ ప్రభావతి, ఎమ్మెస్సీ, బీఈడీ, విద్యా వలంటీర్

ట్యూషన్ భారం లేకుండా..



మా అమ్మాయి 8వ తరగతి చదువుతోంది. పాఠశాలలోనే విద్యా వలంటీర్ల ద్వారా ప్రత్యేక తరగతులు చెబుతున్నారని తెలిసి, అమ్మాయిని పాఠశాలలోనే ఉంచి చదివిస్తున్నాం. ప్రత్యేక తరగతుల నిర్వహణ బాగుంది.

– కె.రత్నకుమారి, పేరెంట్

హోం వర్క్‌లో ఇబ్బందులు ఉండేవి




పాఠశాల నుంచి ఇళ్లకు వెళ్లిన విద్యార్థులకు హోం వర్క్ చేసుకోవడంలో ఇబ్బందులు ఉండేవి. స్కూల్లోనే విద్యార్థులను చదివించి, సబ్జెక్టుల్లో సందేహాలు నివృత్తి చేయడం, హోం వర్క్ పూర్తి చేయించడం చేస్తున్నారు. వలంటీర్ల సేవలు బాగున్నాయి.

– షేక్ దరియాబీ, పేరెంట్

అన్నదాతలకు ప్రభుత్వం అండ

- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి
- జిల్లాలో 52,863 మంది రైతుల ఖాతాల్లో రూ.61.73 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల

గుంటూరు వెస్ట్: కష్టకాలంలో రైతులకు వెన్నదన్నుగా నిలుస్తూ వారిని అభివృద్ధి బాటలో రాష్ట్ర ప్రభుత్వం నడిపిస్తుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇన్‌పుట్ సబ్సిడీ నగదును బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ప్రజాప్రతినిధులు, రైతులు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత నెల డిసెంబర్‌లో సంభవించిన మిచాంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన వరి, మిరప, మొక్కజొన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద జిల్లాలో 52,863 మంది రైతులకు రూ.61.73 కోట్లు ముఖ్యమంత్రి విడుదల చేశారన్నారు. ఇది రైతులకు పెద్ద ఆర్థిక చేయూతన్నారు.



రైతులకు నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్

దీంతోపాటు పంట కోసిన తర్వాత వర్షానికి తడిసిన 24,327 క్వింటాళ్ల మొక్కజొన్న, జొన్న పంట నష్టానికి సంబంధించి 474 మంది రైతులకు రూ.1.20 కోట్లు ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించిందన్నారు. అనంతరం కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎస్.శివరామ కృష్ణ, ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కమలా రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.వెంకటేశ్వర్లు లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు.

జగనన్నను గెలిపించేందుకు జనం సిద్ధం

- మేదరమెట్ల సిద్ధం సభకు పెద్దఎత్తున తరలిరానున్న ప్రజలు
- పశ్చిమ నియోజకవర్గం నుంచి 15వేల మందికిపైగా ప్రజలు సిద్ధం సభకు..
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



మాట్లాడుతున్న మంత్రి రజిని, చిత్రంలో ఎమ్మెల్యేలు కిలారి రోశయ్య, మద్దాళి గిరి తదితరులు

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. చంద్రమౌళి నగర్ ప్రధాన రహదారిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం సిద్ధం సభకు సంబంధించిన సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ సిద్ధం సభకు తరలివెళ్లేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని, ఒక్కో నియోజకవర్గం నుంచి ఏకంగా 15 వేల మందికిపైగా ఈ సభకు హాజరయ్యే అవకాశం ఉందని, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పూర్తిస్థాయిలో సిద్ధం సభకు హాజరయ్యే ప్రతి ఒక్కరికీ కావాల్సిన అవసరాలు, చేయాల్సిన ఏర్పాట్లపై నలుగురితో కమిటీని వేస్తున్నామని చెప్పారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, డిప్యూటీ మేయర్ బాలవజ్రబాబు, నియోజకవర్గ పరిశీలకుడు రాతంశెట్టి సీతారామాంజనేయులు, పార్టీ ముఖ్య నేత విడదల గోపి కమిటీలో ఉంటారని తెలిపారు. ఏర్పాట్ల బాధ్యత కూడా వీరిదేనని స్పష్టం చేశారు.

జిల్లా వ్యాప్తంగా గొప్ప స్పందన..

గుంటూరు లోక్‌సభ సమన్వయకర్త కిలారి రోశయ్య మాట్లాడుతూ సిద్ధం సభకు తరలివెళ్లేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. పశ్చిమ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్, ఎమ్మెల్సీ ఏసురత్నం, మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు మాట్లాడారు. కార్పొరేటర్లు, అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పటిష్టంగా ఎన్నికల కోడ్

- జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి
- ప్రజాప్రతినిధులు, అధికారులకు అవగాహన సమావేశం

గుంటూరు వెస్ట్: రానున్న ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుందని, దీనిని సిబ్బంది పటిష్ట విధానాలతో అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా ప్రతినిధులకు, అధికారులు, సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ప్రకటించిన తేదీనుంచి ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందన్నారు. ఈసీ ఆదేశాల మేరకు నియమించిన ప్రత్యేక బృందాలు, నోడల్ అధికారులు నిబంధనల ఉల్లంఘన జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నియమావళి అతిక్రమించే వారిపై కేసులు నమోదు



మాట్లాడుతున్న జేసీ జి.రాజకుమారి

చేయాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ప్రజాప్రతినిధులు పూర్తి సహకారమందించాలని కోరారు. ప్రజల నుంచి వచ్చే సమాచారం స్వీకరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ జరిపించాలని తెలిపారు. దీంతోపాటు మరిన్ని అంశాలను జేసీ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఆర్డీఓ పి.శ్రీకర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్ పాల్గొన్నారు.

స్వావలంబనకు 'చేయూత'

- వైఎస్సార్ చేయూత పథకం ద్వారా నేడు నాలుగో విడతగా రూ.174.88 కోట్లు విడుదల
- 45 సంవత్సరాలు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు లబ్ధి
- జిల్లాలో 93,275 మంది లబ్ధిదారులు


నెహ్రూనగర్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్నివర్గాల ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ఆదేవిధంగా 45 నుంచి 60 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం వైఎస్సార్ చేయూత పథకాన్ని ప్రారంభించి ఆర్థిక తోడ్పాటును అందిస్తోంది. మూడేళ్ల విజయవంతంగా చేయూత పథకాన్ని అమలు చేసిన ప్రభుత్వం వరుసగా 4వ ఏడాది నిధుల విడుదలకు రంగం సిద్ధం చేసింది. నేడు అనకాపల్లిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నగదు విడుదల చేయనున్నారు.

జిల్లాలో 93,275 మంది లబ్ధిదారులు..

ఆగస్టు 12, 2020వ తేదీన ప్రారంభమైన వైఎస్సార్ చేయూత పథకం ద్విగ్విజయంగా సాగుతుంది. ప్రతి సంవత్సరం రూ.18,750 చొప్పున నాలుగు విడతల్లో రూ.75 వేలు ఒక్కో మహిళకు లబ్ధి చేకూరుతుంది. మొదటి విడత కింద గుంటూరు జిల్లాలో 1,00,485 మంది లబ్ధిదారులకు రూ.188.41 కోట్లు. రెండో విడత కింద 91,998 మందికి రూ.172.50కోట్లు. మూడో విడత కింద 91,939 మందికి రూ.172.39 కోట్లు అందాయి. మూడు విడతల్లో కలిపి 2,84,422 మంది లబ్ధిదారులకు రూ.533.3 కోట్లు నగదు వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయింది. నేడు జమ కానున్న నాలుగు విడతలో 93,275 మంది లబ్ధిదారులకు రూ.174.88 కోట్లు జమ కానుంది.

విడత	లబ్ధిదారులు	రూ.కోట్లు
మొదటి విడత	10,04,85	188.41
రెండో విడత	91,998	172.50
మూడో విడత	91,939	172.39
నాలుగో విడత	93,275	174.88

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక..



గుంటూరు జిల్లాలో వైఎస్సార్ చేయూత కింద లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగింది. జిల్లాలో మూడు విడతల్లో 2,84,422 మంది లబ్ధిదారులకు రూ.533.3 కోట్లు నగదు జమైంది. నేడు నాలుగో విడత 93,275 మంది లబ్ధిదారులకు రూ.174.88 కోట్లు నగదు మంజూరు కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా జరగనుంది.

– వై.హరిహరనాథ్, డీఆర్‌డీఏ, పీడీ

క్లుప్తంగా

వైద్యకళాశాలలో మహిళా దినోత్సవం



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ మెడికో ఉద్యోగ సంఘం గుంటూరు శాఖ ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు వైద్య కళాశాల ఆవరణలోని అసోసియేషన్ కార్యాలయంలో మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మహిళ విభాగం అధ్యక్షురాలు పద్మావతి అధ్యక్షత వహించి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో పోటీపడడం శుభ పరిణామమని పేర్కొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర మహిళ విభాగం అధ్యక్షురాలు సుగుణ, జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పట్ల తమ సంఘం చిత్తశుద్ధితో పోరాటం చేస్తుందన్నారు. వేడుకల్లో పద్మజ, హేమలత, రోజారాణి, నీలిమ, లీలాబాయి, శారదా తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీసు కేసు నమోదు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం జూనియర్ ఇంటర్ ఒకేషనల్ పరీక్ష రాస్తూ కాపీయింగ్‌కు పాల్పడిన ఓ విద్యార్థిపై అధికారులు మాల్ ప్రాక్టీసు కేసు నమోదు చేశారు. బుధవారం జరిగిన మాథ్స్–1 ఏ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 92 పరీక్ష కేంద్రాల పరిధిలో కేటాయించిన 32,769 మంది విద్యార్థుల్లో 31,892 మంది హాజరయ్యారు. అదే విధంగా ఒకేషనల్ పరీక్షలకు దరఖాస్తు చేసిన 1,121 మంది విద్యార్థుల్లో 1,003 మంది హాజరయ్యారు. గుంటూరులోని ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల కేంద్రంలో మాల్ ప్రాక్టీసు నమోదైంది. పరీక్ష కేంద్రాల్లో అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు.

నమ్మిన వారికి అండగా ఉంటా

- బాధ్యతగా వ్యవహరించిన వారికి రుణపడి ఉంటా
- ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

పట్నంబజారు: ఎక్కడైనా .. ఎప్పుడైనా.. ఎటువంటి పరిస్థితుల్లోనైనా... ఖచ్చితంగా తాను నమ్మిన వారికి అండగా ఉంటానని, పార్టీ జెండాను భుజాన పెట్టుకుని బాధ్యతగా వ్యవహరించిన ప్రతి ఒక్కరికీ తాను రుణపడి ఉంటానని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని చెప్పారు. ఈమేరకు బుధవారం 45వ డివిజన్ కార్పొరేటర్ యక్కాల మారుతి, పార్టీ నేత కోలింగారెడ్డి ఆధ్వర్యంలో కొరిటెపాడు ప్రధాన రహదారిలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి విగ్రహావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ రానున్న ఎన్నికలు ఎంతో కీలకమన్న అంశాన్ని ప్రతి ఒక్కరూ గమనించాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమం, అందరికీ అందజేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మీ అందరిపై నమ్మకంతో బీసీ మహిళనైన తనను సీఎం జగనన్న ఇక్కడకు పంపారని, రానున్న ఎన్నికల్లో తమ ఇంటి ఆడపడుచుగా ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు.

ఆలోచనలే పునాది .. ఆశయాలే పరమావధి : శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆలోచనలే పునాదిగా, మహానేత వైఎస్సార్ ఆశయాలే పరమావధిగా వైఎస్సార్ సీపీ పుట్టిందని శాసన మండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. మనందరిపై నమ్మకంతో పశ్చిమ నియోజకవర్గానికి మన ఆడపడుచు విడదల రజినిని పంపారని, భారీ మెజార్టీతో గెలిపించుకుని సీఎం జగన్‌కు గిఫ్ట్‌గా ఇవ్వాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని సూచించారు.

పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. అంబేడ్కర్ భావజాలంతో రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారన్నారు. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనార్టీలు అంటూ అణగారిన వర్గాలను తన సొంత మనుషుల్లా భావించి వారికి మంచి చేస్తున్న మంచి మనసున్న వ్యక్తి సీఎం జగన్ అని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో జిల్లాలోని వైఎస్సార్ సీపీ అభ్యర్థులందరినీ గెలిపించుకోవడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము), రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, డెప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, పార్టీ నేతలు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, నూనె ఉమామహేశ్వరరెడ్డి, పార్టీ నేతలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్, మండల ఇన్‌చార్జిలు, పలు కార్పొరేషన్‌ల చైర్మన్లు, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణలో మంత్రి రజిని, విప్ అప్పిరెడ్డి తదితరులు

పల్నాడులో 2,126 టన్నుల కందుల సేకరణ

నరసరావుపేట: జిల్లాలో 140 రైతు భరోసా కేంద్రాలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 2126 మెట్రిక్ టన్నుల కందులను 1,344 రైతుల ద్వారా సేకరించి జిల్లాలోని 15 దాల్‌మిల్లులకు పంపించటం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. బుధవారం మాచర్లలోని శ్రీ శ్రీనివాస దాల్‌మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కందిపప్పు మిల్లింగ్, తయారీ విధానం పరిశీలించారు. జిల్లాలో 17,300 హెక్టార్లలో కందిపంట సాగు చేశారని, 25వేల మెట్రిక్ టన్నులు కందుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఆ కందులను కొనుగోలు చేసేందుకు సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కందులు విక్రయించిన 1296 మంది రైతులకు వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయటం జరిగిందని పేర్కొన్నారు.

క్రీస్తు నామంతో విజయాలు సొంతం

- హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ
- 47వ గుడారాల పండుగ ప్రారంభ ప్రార్థన

గుంటూరు రూరల్: క్రీస్తు నామంతో విజయాలు సొంతమవుతాయని హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్ వెస్లీలు తెలిపారు. అమరావతిరోడ్డు గోరంట్ల గ్రామంలోగల హోసన్న మినిస్ట్రీస్ 47వ గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనల్లో బుధవారం ప్రారంభ ప్రార్థన, స్టేజ్ డెడికేషన్ ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రదర్ అబ్రహాం, పాస్టర్ జాన్‌వెస్లీ, పాస్టర్ ఫ్రెడిపాల్, పాస్టర్ రాజు, పాస్టర్ రమేష్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తుని స్తుతి గీతాలు ఆలపించారు. ప్రతి ఏటా నిర్వహించే ప్రత్యేక ప్రార్థనలవలే గుడారాల పండుగకు హాజరయ్యే ప్రతి క్రీస్తుని భక్తునికి ఆయురారోగ్యాలు, క్రీస్తుని కృప కలగాలని క్రీస్తుని భక్తులు సుఖసంతోషాలతో క్రీస్తు నామంలో జీవించాలని ఆకాంక్షించారు. గుడారాల పండుగ కార్యక్రమంలో భాగంగా హోసన్న మినిస్ట్రీస్ సిస్టర్స్, బ్రదర్స్ క్రీస్తు గీతాలను ఆలపించారు.



హోసన్న జయమనరే అంటూ, హల్లెలూయా, హల్లెలూయా, హల్లెలూయా అంటూ క్రీస్తుని నామాన్ని ఘనపరిచారు. గుడారాల పండుగకు వచ్చే భక్తులకు వసతి, భోజన ఏర్పాట్లు చేశారు. రాత్రి ప్రత్యేక ప్రార్థనలకు భారీ విద్యుత్ కాంతులతో కూడిన లైట్లు ప్రత్యేక స్టేజీ ఏర్పాటు చేశారు. పగలు ప్రత్యేక ప్రార్థనలకు చలువ పందిళ్ళు ఏర్పాటు చేశారు. రైల్వే శాఖ ప్రత్యేక రైళ్ళను నడుపుతున్నట్లు తెలిపారు. భక్తులకోసం వైద్య ఆరోగ్య శాఖ, ఆర్‌టీసీ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ క్రమబద్దీకరణకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక ఏర్పాటు చేశారు. 7వ తేదీ సాయంత్రం నుంచి 10వ తేదీ మధ్యాహ్నం వరకూ జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో సుమారు 20 లక్షల మంది క్రీస్తుని భక్తులు పాల్గొంటారని సమాచారం.

నల్లపాడు సీఐ సస్పెన్షన్

నగరంపాలెం: గుంటూరు జిల్లాలోని నల్లపాడు పోలీస్‌స్టేషన్ (పీఎస్) సీఐ రాంబాబుపై సస్పెన్షన్ వేటు పడింది. గుంటూరు రూరల్ మండలం ఓ గ్రామ పరిధిలో స్థలం వివాదం దృష్ట్యా ఒక వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ డీపీఓలోని స్పందనలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఈ క్రమంలో సదరు సీఐపై జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. విచారణ అనంతరం నివేదికను గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజుకి విన్నవించినట్లు సమాచారం. ఈ క్రమంలో సదరు సీఐపై సస్పెన్షన్ విధించారు. గతేడాదిలో సీఐగా ఉద్యోగోన్నతి పొందిన ఆయనకు సీఐగా తొలి పోస్టింగ్‌ను నల్లపాడు పీఎస్‌కు కేటాయించారు. కొద్ది నెలల వ్యవధిలోనే సస్పెన్షన్ వేటుపడటం గమనార్హం.

ఇద్దరు ఇంటర్ విద్యార్థుల డిబార్

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్ చేస్తు పట్టుబడ్డారు. బుధవారం జూనియర్ ఇంటర్మీడియెట్ గణితశాస్త్రం–1 పరీక్షలో గురజాల .ఉఆర్ఆర్ నవోదయ కళాశాలలో ఒకరు, చిలకలూరిపేట మోడరన్ జూనియర్ కళాశాలలో ఒకరు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడినట్టు ఇంటర్ పరీక్షల జిల్లా ప్రత్యేక అధికారి టి.శేఖరబాబు తెలిపారు. కాగా, జిల్లాలో జూనియర్ ఇంటర్మీడియెట్ పరీక్షకు 885 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చెప్పారు. జనరల్ ఇంటర్మీడియెట్‌లో 16,149మందికి గాను 15,414 మంది హాజరయ్యారని, మరో 735 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులు 925 మందికి గాను 805 మంది హాజరుకాగా, 120 మంది గైర్హాజరయ్యారు.

చంద్రబాబుకు ఓటమి భయం

- ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారాయన!
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తెనాలిరూరల్: రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించిన చంద్రబాబు ఫ్రస్ట్రేషన్‌లోకి వెళ్లిపోయారని, ఓట్లు రావు, గెలవలేమని ఆయనకు అర్థమైందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి అన్నారు. తెనాలి మార్కెట్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన రైతు కుటుంబం, ఎద్దుల బండి విగ్రహాలను స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో కలసి మంత్రి బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి గోవర్ధనరెడ్డి మాట్లాడారు. 2014కు ముందు రకరకాలైన మాయ మాటలు చెప్పి ప్రజలు, రైతులను చంద్రబాబు మోసం చేశారని, ఇప్పుడు బీసీ డిక్లరేషన్ అంటూ మరో మోసానికి తెరలేపారన్నారు. 2019లో తాము అధికారంలోకి వచ్చాక నాలుగు విడతల్లో రైతులకు రైతు భరోసా ఇస్తామని జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారని, అయినా ఐదుసార్లు రైతు భరోసా ఇచ్చారని తెలిపారు. ఇటీవలి తుఫాన్‌కు నష్టపోయిన రైతాంగానికి, 103 కరువు మండలాల రైతులకు రూ. 1200 కోట్ల పైచిలుకు పరిహారాన్ని ముఖ్యమంత్రి అందజేశారని తెలిపారు. ఎమ్మెల్యే శివకుమార్ విజ్ఞప్తి మేరకు తెనాలి నియోజకవర్గంలో కొల్లిపరలో మరో మార్కెట్ యార్డు ఏర్పాటుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదం తెలిపారని చెప్పారు.

ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ రైతు పక్షపాత ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో యార్డు చైర్‌పర్సన్ అవుతు సీత నగేష్ రెడ్డి, వైస్‌చైర్మన్ వంపుగళ్ల కృష్ణ, పాలకమండలి సభ్యులు, మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ బి.రాజబాబు, మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి జేవీ సుబ్బారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్, వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



రైతు కుటుంబ, ఎద్దుల బండి విగ్రహాల ఆవిష్కరణలో మంత్రి గోవర్ధనరెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్

వైభవం.. పెదకాకానిలో బ్రహ్మోత్సవం

శివాలయంలో ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



పెండ్లికుమార్తెగా భ్రమరాంబ అమ్మవారు

పెదకాకాని: శివాలయంలో మహా శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఉత్సవాలను బుధవారం అర్చకులు పూజా కార్యక్రమాలతో సాంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. మల్లేశ్వరస్వామివారిని పెండ్లి కుమారునిగా, భ్రమరాంబ అమ్మవారిని పెండ్లికుమార్తెగా అలంకరించారు. ఆలయంలో తెల్లవారుజామున 5 గంటలకే సుప్రభాత సేవ, పంచహారతులతో పూజా కార్యక్రమాల క్రతువు ప్రారంభమైంది. శైవాగమ పద్ధతిలో స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చకుడు పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాదు పర్యవేక్షణలో అర్చకస్వాములు, వేదపండితులు తొలిరోజు ప్రత్యేక పూజలు జరిపించారు. ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామ వరప్రసాదు, ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పాలకవర్గం సభ్యులు పర్యవేక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రెండవరోజు గురువారం శ్రీ భ్రమరాంబ అమ్మవారిని వనదుర్గాదేవిగా అలంకరించడం జరుగుతుందని, ప్రత్యేక వేదికపై శ్రీరామలింగ ప్రతిష్ట ఏర్పాటు చేయడం జరుగుతుందని, సాయంత్రం 6 గంటలకు నరనంది వాహనంపై అత్యంత వైభవంగా గ్రామోత్సవం జరుగుతుందని ఆలయ ఉప కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలియజేశారు.



పూజా క్రతువు నిర్వహిస్తున్న వేదపండితులు

ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు..

పెదకాకాని శివాలయంలో మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ ఉప కమిషనర్ డి.శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఉచిత అన్నప్రసాదాన్ని ప్రారంభించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పాలకవర్గం సభ్యులు కొమ్మూరి కోటిరత్నాలు, కారంకి నాగేశ్వరమ్మ, మందాళ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల ఖిల్లా.. గుంటూరు జిల్లా

- ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి
- అంకిరెడ్డిపాలెంలో సింథటిక్ బాస్కెట్ బాల్ కోర్టు ప్రారంభం

గుంటూరు రూరల్: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తామెప్పుడూ సిద్ధంగా ఉంటామని ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగం అభివృద్ధికి, క్రీడాకారుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉన్నట్లు ఆయన చెప్పారు. సీఎం సంపూర్ణ సహకారంతో గుంటూరు జిల్లాను క్రీడల ఖిల్లాగా తీర్చిదిద్దుతామని ఆయన ప్రకటించారు. గుంటూరు రూరల్ అంకిరెడ్డిపాలెం సమగ్రాభివృద్ధిలో భాగంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన అత్యాధునిక సింథటిక్ బాస్కెట్ బాల్ కోర్టును స్థానిక కార్పొరేటర్ శ్యామల వెంకట రమణ దేవి, బ్రహ్మారెడ్డి, అంకిరెడ్డిపాలెం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, బాస్కెట్ బాల్ అసోసియేషన్ నేతలు, క్రీడాధికారులతో కలిసి ఎమ్మెల్సీ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో కలసి ఆయన కొద్దిసేపు సరదాగా బాస్కెట్ బాల్ ఆడి వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ, విద్యారంగం తర్వాత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు క్రీడారంగం ద్వారానే పుష్కలంగా లభిస్తున్నట్లు చెప్పారు. ముందు చూపు గల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యారంగం తర్వాత రాష్ట్రంలో క్రీడారంగం అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు వెల్లడించారు. విద్యతో పాటు ఆయా క్రీడల పట్ల మక్కువ పెరిగేలా విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా ఓవైపు బాస్కెట్ బాల్ కోర్టు మరోవైపు క్రికెట్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ సుభాష్ చంద్రబోస్, సెక్రటరీ జి.చక్రవర్తి, ద న్యూ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు డిస్ట్రిక్ ప్రెసిడెంట్ మారెళ్ళ రేవతి, సెక్రటరీ ఆంజనేయులు, జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి వెంకటేశ్వరరావు, అంకిరెడ్డిపాలెం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కుర్రా పుల్లారెడ్డి, లేళ్ళ పెద్ద అప్పిరెడ్డి, కుర్రా సాంబిరెడ్డి, మున్నంగి సంజీవరెడ్డి, దేవగిరి వీర గంగాధరరెడ్డి, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), గీతామందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, నూనె ఉమా మహేశ్వరరెడ్డి, పానుగంటి చైతన్య, పరిశపోగు శ్రీనివాసరావు, యోగేశ్వరరెడ్డి, కార్పొరేషన్ డీఈ కళ్యాణ్, బాస్కెట్ బాల్ కోచ్‌లు సుకన్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



అంకిరెడ్డిపాలెంలో బాస్కెట్‌బాల్ కోర్టును ప్రారంభిస్తున్న శాసనమండలి విప్ లేళ్ళ అప్పిరెడ్డి



బాస్కెట్‌బాల్ ఆడుతున్న లేళ్ళ అప్పిరెడ్డి

మహనీయుల స్ఫూర్తి ఆదర్శనీయం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- తెనాలి బండ్‌పై మాజీ సీఎం రోశయ్య విగ్రహావిష్కరణ

తెనాలిఅర్బన్: తెనాలి చరిత్రను భావితరాలు తెలుసుకునేందుకు ఆ ప్రాంతంలో వివిధ రంగాలలో రాణించిన మహనీయుల విగ్రహాలను తెనాలి బండ్‌పై ఏర్పాటు చేయటం జరుగుతుందని, అందరు వీటిని చూసి స్ఫూర్తి పొందాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. తెనాలి బండ్‌పై నూతనంగా ఏర్పాటు చేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు రాష్ట్ర మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలు, కళాకారులు, రాజకీయ ప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధులు ఎందరో ఇక్కడ జన్మించి తెనాలి కీర్తిని మరింత ఇనుమడింపజేశారని వివరించారు. రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య 14 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. రోశయ్య కుమారుడు కొణిజేటి శివసుబ్బారావు మాట్లాడుతూ తన తండ్రి సేవలను గుర్తుంచుకుని తెనాలిలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయటం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు. అనంతరం శ్రీపొట్టి శ్రీరాములు ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు, విగ్రహదాత, శిల్పి, ఇతర నిర్వాహకులను ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కౌన్సిలర్‌లు గుంటూరు కోటేశ్వరరావు, పేరం సంజీవరెడ్డి, ప్రియదర్శిని విద్యాసంస్థల చైర్మన్ చందు రామారావు, ప్రముఖ వ్యాపార వేత్తలు నూలక వేణు, నంబూరు కృష్ణమూర్తి, విగ్రహదాత కొత్తమాసు కుమార విజయ భాస్కర్, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాళి శేషాచలం, కొల్లా గురునాధ గుప్తా, ఎం.దశరధ రామిరెడ్డి, ఆలమూరి విజయలక్ష్మీ కుమారి, నెహ్రూనికేతన్ విద్యాసంస్థల ఎండీ మురళీకాంత్, ఉప్పల వరదరాజులు, వజ్రాల రామలింగాచారి, పెండేల వెంకట్రావు, శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రోశయ్య విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్, రాజకుమారి